- ఆందోళనలో జిల్లా సర్పంచులు
- మరో రెండ్రోజుల్లో ముగియనున్న పదవీ కాలం

పెండింగ్ బిల్లులు ఇంకెప్పుడు?



భైంసా, జనవరి 29 : మరో రెండ్రోజుల్లో గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీ కాలం ముగియనుంది. ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు రూ. లక్షల్లో ఉండిపోవడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో మొత్తం 396 గ్రామ పంచాయతీలున్నాయి. ఒక్కో పంచాయతీ పరిధిలో సగటున రూ. 6లక్షలకు పైగానే పెండింగ్‌లో బిల్లులున్నాయి. జిల్లాలో మొత్తం రూ. కోట్ల వరకు గ్రామ పంచాయతీలకు సంబంధించిన వివిధ అభివృద్ధి పనుల బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. ఈ ఐదేళ్లలో పలువురు సర్పంచులు తమ సొంత డబ్బులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. జిల్లాలో 350 పైగా డంపింగ్ యార్డులు, 300 వరకు వైకుంఠధామాలు, 270 వరకు రైతు కల్లాలను, 400 పైగా నర్సరీలను చేపట్టారు. పలుచోట్ల సర్పంచులే గుత్తేదారు అవతారమెత్తి అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఐదో విడత పల్లె ప్రగతిలో భాగంగా క్రీడా మైదానాలను ఏర్పాటు చేశారు. మంచినీటి పైప్‌లను మరమ్మతులు, సామాజిక భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టారు. కొత్త గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించారు. వీటిలో చాలా పనులకు ఇప్పటికీ బిల్లులు మంజూరు కాలేదు. సర్పంచులు బిల్లుల కోసం జిల్లా ఉన్నతాధికారుల చుట్టు తిరిగి అలసిపోయారు. ప్రస్తుతం పదవీకాలం ముగినుండడంతో పెండింగ్ బిల్లుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

● 15వ ఆర్థిక సంఘం నిధులు ఆదుకోలేదు

మూడు నెలల క్రితం 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం మంజూరు చేసింది. మొదటి విడతలో జిల్లాకు రూ.15 కోట్లు విడుదల అయ్యాయి. తమ పెండింగ్ బిల్లులకు ఉపయయోగపడుతాయని సర్పంచులు భావించగా.. అవి సిబ్బంది జీతభత్యాలు, పంచాయతీ నిర్వాహణకే సరిపోయాయి. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఎప్పటి లాగానే పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులైనా వస్తాయోమోనని ఎదురుచూడగా రాకపోవడంతో సర్పంచుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఫిబ్రవరి మొదటి వారం నుంచి పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. సర్పంచులకు ఉన్న అధికారాలు అన్ని తొలగిపోతాయి. ఈ నేపథ్యంలో పెండింగ్ బిల్లులు రావాలంటే ప్రత్యేక పాలనలో అధికారుల చుట్టు తిరగాల్సి ఉంటుందని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవి ఉన్నప్పుడే తమకు బిల్లులు మంజూరు చేసుకోవడంలో నానా తిప్పలు పడుతున్నామని, పదవి పోతే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

● ప్రత్యేక అధికారుల పాలనకు సన్నాహాలు

సర్పంచుల పదవీ కాలం ముగియడంతోనే ప్రత్యేక అధికారుల పాలన కొనసాగించడానికి ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాట్లు చేపట్టింది. నిర్మల్ జిల్లాలోని 396 గ్రామాల వారీగా ప్రత్యేక అధికారులను ఎవరు నియమించాలనే దానిపై జిల్లా అధికారులు కసరత్తులు పూర్తి చేశారు. ప్రత్యేక అధికారుల పాలన వస్తే పంచాయతీల నిర్వహణ పూర్తి బాధ్యత వారిపైనే ఉంటుంది. అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరు గ్రామ పంచాయతీ నిర్వహణ వంటి పనులన్నీ ప్రత్యేక అధికారులే చూస్తారు. ఈ నేపథ్యంలో బిల్లుల మంజూరుపై సర్పంచుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



పదవీ కాలం ముగియక ముందే పెండింగ్ బిల్లులు చెల్లించాలి



● శ్రీనివాస్, సర్పంచ్, దేగాం గ్రామపంచాయతీ

ప్రభుత్వం జాప్యపు విధానాలు అవలంభించకుండా గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించే చర్యలు చేపట్టాలి. అధికారుల ఆదేశాల మేరకు పనులు పూర్తి చేసేందుకు అప్పులు చేయాల్సి వచ్చింది. బిల్లులు పెండింగ్‌లో ఉండటం మూలంగా చేసిన అప్పుల వడ్డీలు చెల్లించేందుకు తంటాల పడాల్సి వస్తోంది. గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా చేసిన పనుల బిల్లులు చెల్లించకపోవడం ఎంత వరకు సబబు



హైదరాబాద్‌లో నర్సారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రేవంత్‌రెడ్డి

మాజీ మంత్రి నర్సారెడ్డి కన్నుమూత

● సీఎం రేవంత్, మంత్రి సీతక్క సహా ప్రముఖుల సంతాపం

నిర్మల్ కల్చరల్, జనవరి 29 : కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి రాష్ట్ర మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రొద్దుటూరి నర్సారెడ్డి సోమవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నర్సారెడ్డి జూబ్లీహిల్స్‌లోని సొంత నివాసం వైట్ హౌస్‌లో మృతి చెందారు. ఆయన మృతికి సీఎం రేవంత్ రెడ్డి సహా మంత్రి సీతక్క, పలువురు సీనియర్ నాయకులు ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన నివాసానికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

● నర్సారెడ్డి సేవలు చిరస్మరణీయం : సీఎం

పీసీసీ అధ్యక్షుడిగా పి.నర్సారెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రజలకు విశేష సేవలందించారన్నారు. నర్సారెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన చేసిన సేవలు కొనియాడారు.

● నర్సారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు..: డీసీసీ అధ్యక్షుడు

పి.నర్సారెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు అన్నారు. సోమవారం సీఎంతో కలిసి నర్సారెడ్డి పార్థివ దేహానికి హైదరాబాద్‌లో నివాళులర్పించారు. ప్రగాఢ సంతాపం తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, శ్రీహరి రావుతో కలిసి నివాళులర్పించారు.

● నర్సారెడ్డి మృతి తీరని లోటు: ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ పీసీసీ, మాజీ మంత్రి పి. నర్సారెడ్డి మృతి తీరని లోటని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లోని నర్సారెడ్డి నివాసంలో భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తనకు రాజకీయ గురువైన నర్సారెడ్డి మృతి జీర్ణించుకోలేకపోతున్నట్లు విచారం వ్యక్తం చేశారు. ఎంపీ,ఎమ్మెల్యే,ఎమ్మెల్సీగా ఆయన సేవలు గుర్తుచేసుకున్నారు.

● నర్సారెడ్డి జీవితం ఈ తరానికి ఆదర్శం: మాజీ మంత్రి ఐకే రెడ్డి

మాజీ పీసీసీ, సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి పి.నర్సారెడ్డి నేటి తరానికి ఆదర్శమని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నర్సారెడ్డి మృతి పట్ల ఆయన సోమవారం ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. రాజకీయ నాయకుడిగా ఆయన జీవితం మార్గదర్శనమని అన్నారు. విలువలకు కట్టుబడి తనదైన శైలిలో పరిపాలన దక్షుడిగా సేవలందించాడని కొనియాడారు. నిర్మల్ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించి రాష్ట్ర, కేంద్ర స్థాయిలో గుర్తింపు పొందారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి నర్సారెడ్డి విశేష కృషి చేశారన్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని బాధపడ్డారు. ప్రభుత్వ లాంఛనాలతో నర్సారెడ్డి భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించాలన్నారు.

గౌరవాన్ని పెంచేలా పోలీసులు పనిచేయాలి : ఎస్పీ షర్మిల



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ కల్చరల్, జనవరి 29 : జిల్లా పోలీసులు ప్రజల్లో గౌరవం పెంచేలా పనిచేయాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల విభాగం నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలుంటాయన్నారు. పోలీసుల సహాయం కోసం నిర్భయంగా పోలీసుస్టేషన్‌కు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. మూడో వ్యక్తిపై ఆధారపడొద్దని సూచించారు. సమస్యలు తెలుసుకున్న ఎస్పీ సంబంధిత స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని, శాంతిభద్రతలకు సహకరించాలన్నారు. సమాచారం తెలియజేసేందుకు వాట్సాప్‌నెంబర్ 8712659599 ఉపయోగించుకోవాలన్నారు.


మత విద్వేషాలు రెచ్చగొట్టిన కేసులో నిందితుడికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష

భైంసా, జనవరి 29 : పట్టణ పరిధిలో 2016 సంవత్సరములో మత విద్వేషాలు రెచ్చగొట్టి ఇరువర్గాల మనోభావాలు దెబ్బతీసేలా చర్యలు చేసిన నిందితుడికి శిక్ష ఖరారు అయ్యింది. సంబంధిత కేసులో సోమవారం నిందితుడికి రెండున్నర సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ భైంసా జూనియర్ సివిల్‌జడ్జీ దేవేంద్రబాబు తీర్పును వెలువరించారు. పట్టణంలోని శివాజీనగర్ కాలనీకు చెందిన సూర్యవంశీ సాయినాథ్‌కు పిప్రి కాలనీకు చెందిన కోలకొడ సురేష్‌ల మధ్య మతపరమైన ఘర్షణ జరిగింది. ఈ ఘటనపై సూర్యవంశీ సాయినాథ్ చేసిన ఫిర్యాదు మేరకు 2016లో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసునమోదు అయ్యింది. సంబంధిత కేసు విచారణలో భాగంగా సోమవారం భైంసా జూనియర్ సివిల్ జడ్జి దేవేంద్రబాబు సాక్షులను విచారించి తీర్పు వెలువరించారు.

పెంపుడు జంతువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

భైంసా, జనవరి 29 : పెంపకందారులు తమ తమ పెంపుడు జంతువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని భైంసా ఎంపీపీ రజాక్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం భైంసా పశువైద్యశాలలో అంటీ రేబీస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పెంపుడు జంతువులు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు క్రమం తప్పకుండా అవసరమైన వ్యాక్సినేషన్ చేయించాలన్నారు. ప్రతిఏటా తప్పనిసరిగా అంటీ రేబీస్ వ్యాక్సిన్ చేయించాలని పేర్కొన్నారు. భైంసా పశువైద్యాధికారి డా.విఠల్ పెంపుడు జంతువుల పెంపకంపై పెంపకందారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఇందులో బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు గాలి రవి, పెంపుడు జంతువుల పెంపకందారులు పాల్గొన్నారు.

యాక్షన్‌ప్లాన్‌పై ప్రత్యేక సమావేశం



ప్రత్యేక సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ

లక్ష్మణచాంద, జనవరి 29 : మండలంలోని 2024-25 సంవత్సరంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల గూర్చి ఎంపీపీ అడ్వాల పద్మ అధ్యక్షతన సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు నిర్వహించటం కోసం యాక్షన్ ప్లాన్‌పై అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి చర్చించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, ఎంపీడీవో శేఖర్, వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, ఎంపీవో నసీరుద్దీన్, ఏపీవో ప్రమీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

సురక్షిత ప్రయాణానికి రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి : కలెక్టర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నిర్మల్ కల్చరల్, జనవరి 29 : రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే సురక్షిత ప్రయాణం చేయవచ్చునని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం ఆయన ఎస్పీ జానకి షర్మిలతో కలిసి 37వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మాసోత్సవాలను పురస్కరించుకొని రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలని, ఫోర్ వీలర్లు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని, మొబైల్ ఫోన్‌లు, మద్యంకు దూరంగా ఉండాలన్నారు. ప్రైవేట్ జీపులు, ఇతర వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, అతివేగం పనికిరాదన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద జాగ్రత్తలు పాటించాలని, అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు దారి ఇవ్వాలన్నారు. అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఆర్ అండ్ బి ఈఈ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టవద్దన్నారు. 37 ఫిర్యాదులు అందాయన్నారు. అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్ పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. పలు శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుండేగాం గ్రామానికి సత్వరమే పునరావాసం కల్పించాలి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

● మంత్రి ఉత్తమ్‌తో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, జనవరి 29 : పల్సికర్ రంగారావ్ ప్రాజెక్టు ముంపు బాధితులైన గుండేగాం గ్రామస్థులకు సత్వరమే పునరావాసం కల్పించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ రాష్ట్ర ఇర్రిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ ముథోల్ నియోజక వర్గ సమస్యలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో బేటి అయ్యారు. వర్షకాలంలో కురిసిన భారీ వర్షాల మూలంగా దెబ్బతిన్న సిరాల ప్రాజెక్టుతో పాటు ఇతర చెరువుల మరమ్మత్తులకు, సాగు నీటి వ్యవస్థ మెరుగుదలకు అవసరమైన నిధుల మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదే క్రమంలో ఎత్తిపోతల పథకాలన్నింటిని వినియోగంలోకి తీసుకవచ్చేందుకు నిధులు కేటాయించాలని కోరారు. గుండేగాం గ్రామానికి కాలయాపనకు తావు లేకుండా పునవాస చర్యలు ప్రారంభించాలన్నారు. రానున్న బడ్జెట్‌లో గడ్డెన్నవాగు ప్రాజెక్టు నిర్వాహణ వ్యవస్థ, మరమ్మత్తుల కోసం అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రాధాన్యతననుసారం నిధులను కేటాయించి సాగు నీటి వసతి మెరుగుదలకు పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు.

ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించేందుకు కృషి చేయాలి

● డీఈవో రవీందర్ రెడ్డి

నిర్మల్ అర్బన్, జనవరి 29 : ఇంగ్లీష్ భాషపై ఉన్న భయాన్ని తొలగించుకొని ఆ భాషపై పట్టు సాధించేందుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని డీఈవో రవీందర్ రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక జుమ్మేరాత్‌పేట్ హైస్కూల్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి స్పెల్ విజార్డ్ పోటీలకు సంబంధించి ప్రశ్నాపత్రాలను డీఈవో విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ... ఇంగ్లీష్ భాష ప్రాధాన్యత విస్తరించిన కారణంగా ప్రతి విద్యార్థికి ఆ భాషపై అవగాహన పెరగాలన్నారు. మాతృభాషతో సమానంగా ఇంగ్లీష్ భాషను కూడా ఆదరించాలని సూచించారు. ఇంగ్లీష్ భాషపై విద్యార్థులు భయం, అపోహ తొలగించుకోవాలన్నారు. కష్టపడి చదివితే ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించడం అసాధ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల అధికారి పద్మ, జుమ్మేరాత్‌పేట్ హైస్కూల్ హెడ్ మాస్టర్ అల్లం రవిబాబు, ఎల్టా అధ్యక్షుడు కదార్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఎల్టా బాధ్యులు వివేక్, ఇర్ఫాన్ షేక్, మనోహర్‌రెడ్డి, గంగాధర్, లక్ష్మీనారాయణ, అమారుల్లాఖాన్, రమణ, స్వాతి, హిమబిందు, ఫహ్మిదా ఖాతుం, గీతారాణి, ఇంతియాజ్ అహ్మద్, టీచర్లు దత్తురాం, మనోహర్, గంగాధర్, శ్రీనివాస్, రాజన్న, దయానంద్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.



ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

ముథోల్ సీఐగా మల్లేష్



ముథోల్ సీఐగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరిస్తున్న జి. మల్లేష్

ముథోల్, జనవరి 29 : ముథోల్ సీఐగా జి. మల్లేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ముథోల్ సీఐగా పని చేసిన వినోద్ రెడ్డి బదిలీపై ఐజీ కార్యాలయానికి వెళ్లగా ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ నుండి బదిలీపై మల్లేష్ ముథోల్ సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై సాయి కుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఉమ్రి గ్రామంలో కార్డన్ సెర్చ్



ఉమ్రిలో సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నైలు

తానూర్, జనవరి 29 : మండలంలోని ఉమ్రి గ్రామంలో సోమవారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కమ్యూనిటి కాంటాక్ట్ ప్రోగ్రాంనిర్వహించడం జరిగిందని భైంసా రూరల్ సీఐ నైలు తెలిపారు. కార్డెన్‌సెర్చ్ అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కం తమ వాహనాలకు సంబంధించి సరైన పత్రాలను వెంట ఉంచుకోవాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించి జాగ్రత్తలు సూచించారు. అసంఘటిత శక్తులను అడ్డుకోవడానికే కార్డన్‌సెర్చ్ నిర్వహించడం జరిగిందనితెలిపారు. ఈ సెర్చ్‌లో సరైన వాహనపత్రాలు లేని 81ద్విచక్ర వాహనాలు, మూడు ఫోర్‌విల్లర్స్ పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లోకం సందీప్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఇసుక డంపులను సీజ్ చేసిన మైనింగ్ అధికారులు



సీజ్ చేసిన ఇసుక డంపు వద్ద అధికారులు

దిలావర్‌పూర్, జనవరి 29 : కాల్వ గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను సోమవారం జిల్లా మైనింగ్ అధికారి క్రాంతికుమార్, ఎంఆర్ఐ సంతోష్‌తో కలిసి సీజ్ చేశారు. స్వర్ణ వాగులో అక్రమంగా ఇసుక తీస్తూ కాల్వశివారులో డంప చేశారన్న సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు. 13 ఇసుక డంపులున్నట్లు గుర్తించిన అధికారులు వాటిని సీజ్ చేసి గ్రామ పంచాయతీ కార్యదర్శికి స్వాధీనం చేశారు. అలాగే అక్రమంగా ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

సాదాసీదాగా దిలావర్‌పూర్ సర్వసభ్య సమావేశం



మండల సర్వసభ్య సమావేశంలో ప్రగతి నివేదిక చదువుతున్న మత్స్య శాఖ అధికారి

దిలావర్‌పూర్, జనవరి 29 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పాల్దే అక్షర అనిల్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఎజెండాలోని 21 అంశాలపై చర్చ చేపట్టారు. ప్రధానంగా మిషన్ భగీరథ, విద్య, వైద్యం, వ్యవసాయ, మిషన్ కాకతీయ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ఆయా శాఖల అధికారులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా సిర్గాపూర్ సర్పంచ్ గంగారెడ్డి మాట్లాడుతూ... సిర్గాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలిని మాయపూర్ ప్రాథమిక పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపడం పట్ల అభ్యంతరం చెప్పారు. ఎంఏవో శంకర్ సమాధానం ఇస్తూ డిప్యూటేషన్‌పై పంపడం నా పరిధిలోనిది కాదని, డీఈవో పరిధిలోనిదని అన్నారు. ఈ విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కంజర్ సర్పంచ్ మధుకర్ మాట్లాడుతూ... గత మూడు నెలలుగా మిషన్ భగీరథ మంచినీరు రావడం లేదని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత అధికారి సమాధానం ఇస్తూ వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వైద్యాధికారి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ... ఈ నెల 30 నుంచి 15 రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో లెప్రసీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తారన్నారు. ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

మాజీ మంత్రి పి. నర్సారెడ్డి మృతికి మండల సర్వసభ్య సమావేశం సంతాపం ప్రకటించింది. సమావేశం ప్రారంభం కాగానే ఎంపీపీ పాల్దే అక్షర అనిల్ సంతాపం తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మృతికి సంతాప సూచకంగా సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సర్పంచ్‌లకు సన్మానం...

పదవీకాలం ముగియనుండటంతో మండల పరిషత్ తరుపున సర్పంచ్‌లను సమావేశంలో ఎంపీపీ పాల్దే అక్షర అనిల్ ఘనంగా సన్మానించారు. గ్రామాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా సర్పంచ్‌లు సహకరించడం ఆనందంగా ఉందని ఎంపీపీ అన్నారు. పదవులు వస్తాయి పోతాయని అయితే పదవీకాలంలో మనం చేసిన సేవలను ప్రజలు గుర్తుంచుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజీజ్ ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ పుష్ప, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భార్యకు బదులు భర్తకు సన్మానం

మండల పరిషత్ తరుపున సర్పంచ్‌లకు చేసిన సన్మానం చర్చనీయాంశమైంది. మహిళా సర్పంచ్‌కు బదులు ఆమె భర్తను సన్మానించడంపై పలువురు చర్చించుకున్నారు. న్యాలోలం గ్రామ సర్పంచ్ ఓడ్ సవిత సమావేశానికి గైర్హాజరయ్యారు. అయితే ఆమెకు బదులుగా భర్త ఓడ్నం కృష్ణను సన్మానించారు.



లోలం సర్పంచ్ భర్తను సన్మానిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీలు

1 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

నిర్మల్ కల్చరల్, జనవరి 29 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి జే. పరుశరాం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు మూడు విడతల్లో పరీక్షలుంటాయన్నారు. జిల్లాలో 42 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 38 కేంద్రాల్లో జనరల్, 4 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులు పరీక్ష రాస్తారని తెలిపారు. విద్యార్థులు తమ కళాశాల నుండి హాల్ టికెట్లు తీసుకుని పరీక్షకు హాజరుకావాలన్నారు. జిల్లాలో 6,458 జనరల్, 2031 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారన్నారు.

గెజిటెడ్ లెక్చరర్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, జనవరి 29 : నిర్మల్ జిల్లా గజిటెడ్ లెక్చరర్ల సంఘం 711 క్యాలెండర్ సోమవారం ఇంటర్ నోడల్ అధికారి పరుశరాం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి రవీందర్, వెంకటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెకుముఖి టాలెంట్ పరీక్ష

ముథోల్, జనవరి 29 : మండల కేంద్రంలోని రబింద్ర ఉన్నత పాఠశాలలో సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముఖి టాలెంట్ పరీక్షను విద్యార్థులకు నిర్వహించారు. సైన్స్ పట్ల అభిరుచి పెరుగుతుందని ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ అన్నారు.

'పోతరాజ్, ధర్మరాజ్ ఉత్సవాలను జయప్రదం చేయాలి'

ఉట్నూర్, జనవరి 29: ఉమ్మడి జిల్లాలోని కెరమెరి మండలం ఇందాపూర్‌లో ఫిబ్రవరి 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోలాం గిరిజనుల ఆరాధ్య దైవం పోతరాజు, ధర్మరాజుల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టేకం భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టేకం వసంత్‌రావులు అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కోలాం సేవ సంఘం భవనంలో నిర్వహించిన సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని కోలాం గిరిజనులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఆత్రం భీమ్‌రావు, కోర్ కమిటీ సభ్యులు టేకం భీమ్‌రావు, రాజేశ్వర్, రాజు, ఏటీడబ్ల్యూ ఏసీ డైరెక్టర్ ఆత్రం భీమ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు డ్యూటీ క్రమశిక్షణతో కూడినది

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలాం ● జిల్లాకేంద్రంలో పోలీసు సిబ్బందికి నైపుణ్య, శిక్షణ తరగతులు ● ఆయుధాల వినియోగంపై సూచనలు



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 29: పోలీసు డ్యూటీ అనేది క్రమశిక్షణతో కూడిన ఉద్యోగం అని సిబ్బంది విధులలో నూతన పద్ధతులను, నైపుణ్యాన్ని మెరుగు పర్చుకోవడం కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంజరుగుతుందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. ప్రతి సంవత్సరం సిబ్బంది నైపుణ్యాన్ని క్రమశిక్షణను పెంపొందించడం నూతన విధానాలను నేర్చుకోవడంపై నిర్వహించే శిక్షణ కార్యక్రమం మోబిలైజేషన్‌ను ఈ నెల 18నుంచి ఫిబ్రవరి 1వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సిబ్బందికి పలు సూచనలు అందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ వార్షిక మోబిలైజేషన్‌లో సిబ్బందికి లాఠీ డ్రిల్, మాబ్‌ఆపరేషన్, ఫైరింగ్, రైట్‌గేర్ ఎక్విప్‌మెంట్ వినియోగంపై అవగాహన, టీయర్ గ్యాస్,గ్యాస్ గన్ వినియోగం, సిబ్బంది ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, సిబ్బందికి సంబంధించిన వెల్ఫేర్, తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రతీఒక్కరు రిజర్వ్ సిబ్బంది పాల్గొని వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా సిబ్బంది కార్డెన్ అండ్ సెర్చ్ చేసే విధానం, వీఐపీ బందోబస్తు సమయంలో నిర్వహించే తీరు, ఆధునాతన ఆయుధాల వినియోగం, సంఘ విద్రోహ శక్తులపై పోరాటం, తదితర అంశాలపై శిక్షణ అందిస్తూ సిబ్బంది ఒకరికొకరి మధ్య స్నేహభావం పెంపొందించే దిశగా ఈ వార్షిక శిక్షణ మోబిలైజేషన్ కార్యక్రమాలు తోడ్పడతాయని తెలిపారు. సమాజంలో పోలీసులకు ప్రత్యేక స్థానం ఉందని వాటికి కారణం సమాజం కోసం పోలీసులు చేసే కఠోర శ్రమ, పోలీసుల క్రమశిక్షణ చర్యల ద్వారా లభించిందని గుర్తు చేశారు. ఎటువంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా వెంటనే సంఘటన స్థలాలకు చేరుకునే విధంగా సిబ్బంది ఎల్లవేళాల అప్రమత్తమై విధులను నిర్వర్తించాలని ఎస్పీ గౌడ్‌ఆలాం సూచించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఎటువంటి సమస్యలు ఉన్న తెలపాలని, వాటిని త్వరగా పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఇందులో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ఎ.నవీన్, టి.మురళి, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు : అదనపు కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 29: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చే అర్జీలను తక్షణం పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తు లను పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. భూ సంబంధ, ఆసరా పింఛన్లు, ఉపాధి, విద్య, వైద్యం, తదితర సమస్యలపై దరఖాస్తుదారులు అదనపు కలెక్టర్‌కు పెద్దసంఖ్యలో అర్జీలను అందజేశారు. ఈ ఫిర్యాదు ల విభాగంలో జడ్పీ సీఈవో గణపతి, ఆర్డీవో స్రవంతి, మైనార్టీ సంక్షేమ అధికారి రమేష్‌రాథోడ్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజా వేదిక

గుడిహత్నూర్, జనవరి 29: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపట్టిన పనులపై 13వ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. 2022 జనవరి నుంచి 2023 జనవరి 1 వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.నాలుగు కోట్ల 63 లక్షల పనులు చేపట్టారు. వారం రోజుల పాటు గ్రామాల్లో పర్యటించిన సామాజిక తనికీ బృందం తనిఖీలు చేపట్టారు. గ్రామాల వారీగా తయారు చేసిన నివేదికలను డీఆర్‌పీలు చదివి వినిపించారు. అంతేకాకుండా ఉపాధి హామీలో లక్షల రూపాయల అవినీతి జరిగిందని అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భారత్, డీఆర్ డీప ఏపీడీలు రాథోడ్ రవీందర్, కృష్ణారావు, ఎంపీడీవో అరుణ, ఏపీవో సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ఉట్నూర్, జనవరి 29: ఖానాపూర్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం రాత్రి ఉట్నూర్ మండలలోని ఎందా, ఉమ్రి, గొట్టివార్ గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా జైత్‌రామ్ తండా నుంచి గొట్టిపటార్ రోడ్డుకు రూ.1.46 కోట్లతో ఉమ్రి నుంచి లంబాడి తండా రోడ్డుకు రూ.1.97కోట్లతో మంజూరు అయిన బీటీ రోడ్డు పనులకు ఎంతో స్తంభన నిర్వహించారు. ఈ సందర్భంగా గొట్టిపటాలు నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడుతూ గ్రామాలకు రహదారులు ఉంటేనే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాను అన్నివేళలాల అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ ప్రాంత సమస్యలు అన్ని తనకు తెలుసునని వాటిని పరిష్కరించేందుకు పూర్తిగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పెందూరు కళావతిబండు,రాథోడ్ రేణుకా పరశురాం, పీఆర్‌ఎస్ ఈ. జాదవ్ వెంకట్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు జాదవ్ మాణిక్‌రావు, డిప్యూటీ ఈఈ పవర్ రమేష్, ఐటీడీఏ ఏఈఈ రాథోడ్ ఇందల్ కాంటాక్టర్ ముంతాజ్, నాయకులు ఖయ్యుమ్, జాదవ్ జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.



గోట్టిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

● 'పేదల ఆకలిని తీర్చడమే బొజ్జన్న బువ్వ లక్ష్యం'

ఉట్నూర్: పేదల ఆకలిని తీర్చడమే బొజ్జన్న బువ్వ ముఖ్య ఉద్దేశ్యమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సైన్యం సభ్యులు అక్షయ్ పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఐటీడీఏకు ప్రతి సోమవారం వచ్చే అర్జీదారుల ఆకలిని తీర్చేందుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ఆధ్వర్యంలో ప్రతిసోమవారం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఈ అన్నదాన కార్యక్రమం ఇలాగే కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

● అగ్రి ఇన్ పుట్స్ ఉచిత పంపిణీ



లక్ష్మణచాందలో అగ్రి ఇన్ పుట్స్ అందజేస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, జనవరి 29 : ఆధునిక వ్యవసాయ పద్ధతులపై సీఆర్‌డీ (సెంటర్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్) ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. గ్రీన్ షీట్ నెట్, బిందు సేద్యం, రైన్ పైపులపై అవగాహన కల్పించారు. నానో యూరియా, నీమ్ ఆయిల్ వాడకం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అధిక దిగుబడులు రావటం కోసం అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. 15 మందికి రైన్ పైప్ సైట్స్, 25 మందికి టైలరింగ్ కిట్స్, 10 మందికి నీమ్ ఆయిల్, మరో 10 మందికి నానో యూరియా, 20 మందికి గడ్డి విత్తనాలు, 15 మందికి గ్రీన్ షీట్ నెట్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, సీఆర్‌డీ డైరెక్టర్ జయసుందర్, సీఈవో ప్రీతి, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో నజీర్ ఖాన్, ఏఈవో ఉమా మహేశ్వరి, సీఆర్‌డీ మండల కోఆర్డినేటర్ రోహిదాస్, శ్రీనివాస్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

'పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి'

ముథోల్, జనవరి 29 : మండలంలోని కారేగాం గ్రామ పంచాయతీ కార్యదర్శిపై కఠిన చర్యలు తీసుకోవాలని కారేగాం గ్రామానికి చెందిన పలువురు యువకులు సోమవారం ఎంపీడీవో సురేష్ బాబు, ఎంపీవో అమీర్ ఖాన్‌లకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన మహిళ మహారాష్ట్రలో చనిపోతే ఇక్కడ చనిపోయినట్లు తప్పుడు మరణ ధృవీకరణ పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి జారీ చేశారని వారు ఆరోపించారు. ఈ సంఘటనపై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

దుర్గంధ భరితంగా బొడ్డోని కుంట

● మూడు ప్రధాన కాలనీల డ్రైనేజీ నీరు చేరి కలుషితమవుతున్న కుంట ● చెత్తా చెదారం, జంతువుల కళేబరాలతో కంపు కొడుతున్న శాంతినగర్ ● ఎన్నిసార్లు చెప్పినా.. పాలకులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం





బొడ్డోని కుంటలో పేరుకుపోయిన కాలుష్యం ఇలా..

ఖానాపూర్, జనవరి 29 : పట్టణంలోని శాంతినగర్ శివారులోని బొడ్డోని కుంట దుర్గంధ భరితంగా మారుతోంది. ఈ ప్రాంతంలో రోడ్డు వెంబడి నడవాలన్న ముక్కు మూసుకోక తప్పని పరిస్థితి తలెత్తింది. పట్టణంలోని మూడు ప్రధాన ప్రాంతాలైన విద్యానగర్, సుభాష్ నగర్, శాంతినగర్ కాలనీలకు చెందిన డ్రైనేజీ మురికి నీరు కుంటలో చేరుతుంది. దీంతో కుంటలోని నీరంతా ఆకుపచ్చ రంగులోకి మారి దుర్గంధం వెదజల్లుతుంది. అంతేకాకుండా ఈ కుంటలో పెంచుతున్న చేపలన్ని ఈ కలుషిత నీటికి మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం 10 టన్నుల వరకు చేపలు ఈ కుంటలో ఉన్న కలుషిత నీటికి మృత్యువాత పడడంతో నరేష్ అనే మత్స్యకారుడు రూ. లక్షకు పైగా నష్టపోయాడని చెబుతున్నారు. శాంతినగర్ కాలనీలో ఈ కుంట నుండి వచ్చే దుర్వాసనకు ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని చెబుతున్నారు. ప్రతి ఏడాది పదుల సంఖ్యలో కాలనీ వాసులు డెంగ్యూ బారిన పడి ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు. మూడు ప్రధాన కాలనీలకు చెందిన మురికి నీరంతా ఒకే దగ్గరికి చేరి నిల్వ అవుతుండడంతో ఈ మురికి నీటిలో దోమలు భారీగా ప్రబలుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఇదివరకు ఎన్నోసార్లు మున్సిపాలిటీ అధికారులకు చెప్పినప్పటికీ కనీసం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాలనీ వాసులు ఆందోళన చేస్తే స్పందించిన అప్పటి కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ కుంటలోకి డ్రైనేజీ వాటర్ చేరకుండా మురికి నీటి కాలువలను నిర్మాణం చేయాలని అధికారులను ఆదేశించినట్లు కాలనీ వాసులు చెబుతున్నారు. అయినప్పటికీ పాలకులు పట్టించుకోకపోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కుంటలో జంతువుల కళేబరాలు, చికెన్ వ్యర్థాలు పడేస్తుండడంతో రోడ్డు వెంబడి నడిచే వారికి సైతం ఊపిరి బిగపట్టాల్సిన పరిస్థితి తలెత్తిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా ఏర్పడిన ఖానాపూర్ మున్సిపాలిటీకి చైర్మన్‌గా ఉన్న అంకం రాజేందర్ ప్రాతినిధ్యం వహిస్తున్న తొమ్మిదవ వార్డులోనే పరిస్థితి ఇలా ఉండడం పట్ల పలు విమర్శలు తలెత్తుతున్నాయి. గత ఎన్నికల సమయంలో కుంటను సుందరీకరిస్తానని హామీ ఇచ్చిన వారు ఆ దిశగా కనీసం ఒక్క చర్యలు కూడా చేపట్టలేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. సోమవారం సాయంత్రం కాలనీకి చెందిన పలువురు యువకులు రాజ్ కుమార్, వెంకటేష్, మనోహర్, నాగరాజు, శివ, శ్రీను, బబ్లు, సాయి, అరవింద్, తదితరులు బొడ్డోని కుంట వద్ద పాలకుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నిసార్లు చెప్పినా.. పట్టించుకోకపోవడం సరికాదు

బొడ్డోని కుంట కలుషితమవుతోందని ఇదివరకే మున్సిపల్ చైర్మన్ సహా అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశాము. అయినా పట్టించుకోవడం లేదు. దీంతో గతంలో సుమారు 10 క్వింటాళ్ల వరకు చేపలు మృత్యువాత పడ్డాయి. దీంతో సంబంధిత మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బొడ్డోని కుంటను కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలి.



పరిమి సురేష్, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు, ఖానాపూర్

ప్రతీ ఏడాది అనారోగ్యం పాలవుతున్నాం



బొడ్డోని కుంట దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో తీవ్రంగా దోమలు, ఈగ లు ప్రబలి కాలనీలో ప్రతి ఏడాది వందల సంఖ్యలో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. మా కాలనీ నుండి ప్రతి ఏడాది డెంగ్యూ బారినపడి ఆదిలాబాద్ రిమ్స్‌లో సుమారు 10, 15 మంది వరకు చికిత్స పొందుతున్నారు. కుంటను కలుషితం కాకుండా చర్యలు చేపట్టి మమ్మల్ని అనా రోగ్యం బారిన పడకుండా చూడాలని కోరుతున్నారు.

వెంకటేష్, శాంతినగర్ కాలనీ వాసి

జిల్లా రెడ్డి సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక



నిర్మల్ అర్బన్, జనవరి 29 : రాజా బహదూర్ వెంకట్ రామ్ రెడ్డి సొసైటీ ఆధ్వర్యంలోని నిర్మల్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వి. చంద్రశేఖర్‌రెడ్డి ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కే. పోతారెడ్డి, ఉపాధ్యక్షులుగా వడ్డి రాజేందర్ రెడ్డి, ఏనుగు లింగారెడ్డి, కోశాధికారిగా ఏ. దామోదర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఎల్. రాజేశ్వర్ రెడ్డి, అశోక్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక సభ్యులుగా కిషన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గంగారెడ్డి, రాంచందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సత్యపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, వెంకట రమణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలను ఎంపిక చేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గాన్ని జిల్లాలోని రెడ్డి సామాజికవర్గ సభ్యులు అభినందించారు.

రెడ్డి సంఘం బాధ్యులకు సన్మానం

రాజా బహదూర్ వెంకట్‌రామ్‌రెడ్డిరెడ్డి సంఘం నిర్మల్ జిల్లా కార్యవర్గాన్ని ఇటీవల ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, వడ్డి రాజేందర్‌రెడ్డిలను సోమవారం వశిష్ఠ డిగ్రీ కళాశాలలో సన్మానించారు. కళాశాల డైరెక్టర్ సత్యనారాయణ గౌడ్, సెక్రటరీ సరోత్తంరెడ్డిలు శాలువా, పుష్ప గుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అఖిలేష్ కుమార్‌సింగ్, సాధురామ్‌రెడ్డి, కుమ్మరి సత్తయ్య, మోహినొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శక్తి వందన్‌లో పాల్గొన్న నేతలు



పాల్గొన్న ఉమ్మడి జిల్లా బీజేపీ నాయకులు

నిర్మల్ కల్చరల్, జనవరి 29 : హైదరాబాద్‌లో సోమవారం బీజేపీ నిర్వహించిన శక్తి వందన్ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులు హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్‌ను సన్మానించారు. నాయకులు చిట్యాల సుహాసిని రెడ్డి, సామ రాజేశ్వర్ రెడ్డి, ఆకుల శ్రీనివాస్, కమల్‌నయన్, తదితరులు పాల్గొన్నారు.

ముథోల్ జ్యోతి బాపూలే విగ్రహ కమిటీ ఎన్నిక

ముథోల్, జనవరి 29 : మండల కేంద్రమైన ముథోల్‌లో సోమవారం ముథోల్ జ్యోతి బాపూలే విగ్రహ కమిటీ ఎన్నికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అధ్యక్షులుగా పోతన్న యాదవ్, ఉపాధ్యక్షులుగా ఖలీద్ పటేల్, దేవోజి భూమేష్‌లు, ప్రధాన కార్యదర్శిగా తాటివార్ రమేష్, గౌరవ అధ్యక్షులుగా గుంజోళ్ల నారాయణ, ఎజాజొద్దీన్, కోశాధికారిగా సాయన్న, జాయింట్ సెక్రటరీగా కోరి పోతన్న, అధికార ప్రతినిధులుగా విశ్వంబర్, లక్ష్మణ్, రాహుల్, సంగోళ్ల పోతన్న, బి. బాబులు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏప్రిల్ 11లోపు మహాత్మాజ్యోతి బాపూలే, సావిత్రాబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని వెల్లడించారు. సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, మాజీ సర్పంచ్ పాల్గొన్నారు.


andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్టం 32.3, కనిష్టం 12.7

ఆంధ్రజ్యోతి

ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

మంగళవారం 30 జనవరి 2024



హస్నాపూర్ సర్పంచ్ ఉపేందర్ తొలగింపు

ఉట్నూర్, జనవరి 29: మండలంలోని హస్నాపూర్ గ్రామ సర్పంచ్ జాదవ్ ఉపేందర్‌ను పదవి నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉత్తర్వులను జారీ చేశారని ఉట్నూర్ మండల పంచాయతీ అధికారి మహేష్ కుమార్ సోమవారం తెలిపారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన నిధులు దుర్వినియోగం చేసినందున ఆయనపై విచారణ జరిపిన అనంతరం కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని, మరో మూడేళ్ల పాటు ఆయనకు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదన్నారు. ఇన్‌చార్జీగా ఉప సర్పంచ్ నదునూరి అశోక్‌ను నియమించడం జరిగిందన్నారు.



● రేకుల షెడ్డులోనే కొనసాగుతున్న సిరికొండ మండల తహసీల్దార్ కార్యాలయం


పట్టు తప్పుతున్న.. పాలన!

- జిల్లాలోని కొత్త మండలాల్లో ఇంకా పాత సమస్యలు
- అంతటా కార్యాలయాల కరువు.. అధికారులూ ఉండరు
- మరో మూడు కొత్త మండలాల ఏర్పాటుపై కనిపించని కదలిక
- పలుచోట్ల అద్దె భవనాల్లోనే కొనసాగుతున్న కార్యాలయాలు
- ఏళ్లు గడుస్తున్నా.. గాడిలో పడని పాలన
- ఒకవైపు ప్రజాప్రతినిధులు.. మరో వైపు ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజలకు తప్పని తిప్పలు
- జిల్లావ్యాప్తంగా కొత్త మండలాల ఏర్పాటుపై భిన్నాభిప్రాయాలు

ఆదిలాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలనా సౌలభ్యం కోసం కొత్త మండలాలను ఏర్పాటు చేసినప్పటికీ.. దాననుగుణంగా వసతులను కల్పించకపోవడంతో స్థానికులు నిత్యం సమస్యలతోనే సహవాసం చేయాల్సి వస్తోంది. ఏళ్లు గడుస్తున్నా కొత్త మండలాల్లో పలు కార్యాలయాల భవనాలకు పునాదులే పడకపోవడంతో అరకొర వసతులతోనే పాలనను నెట్టుకొస్తున్నారు. దీంతో పాలన పట్టుతప్పుతుందనే వాదనలు బలం గా వినిపిస్తున్నాయి. కొంతమంది అధికారులు ఇలా వచ్చి అలా వెళ్లి పోతున్నా రనే విమర్శలు కూడా లేకపోలేదు. కొన్ని శాఖలకు అద్దె భవనాలు కూడా లేకపోవడంతో ఇప్పటికీ పాత మండలాల నుంచే పాలన కొనసాగుతోంది. అధికారులకు ప్రజలు ఏదైనా సమస్యను చెప్పుకోవాలన్నా.. రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గత ఆరేళ్ల క్రితం జిల్లాలో గాదిగూడ, సిరి కొండ, మావల, భీంపూర్, ఆదిలాబాద్ అర్బన్ ఐదు కొత్త మండలాలను ఏర్పా టు చేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావుడి చేసినా.. ప్రభు త్వం సాత్నాల, బోరజ్, సోనాల మరో మూడు మండలాలను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. గతంలో ఏర్పాటు చేసిన మండలాలకే పూర్తిస్థాయిలో వసతులు కల్పించని రాష్ట్ర ప్రభుత్వం.. మరో మూడు కొత్త మండలాల ఏర్పాటుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కొత్త మండలాల ఏర్పాటుపై పునరాలోచిస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైనా.. మూడు మండలాల ఏర్పాటు ఉంటుందా? లేక రద్దు చేస్తారా? అనేది ఇంకా సందిగ్ధంగానే కనిపిస్తోంది. ప్రజాప్రతినిధులు జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు మరిన్ని ఇబ్బందులకు గురవుతున్నారు.

పేరుకే కొత్త మండలం

కొత్త మండలాలను ఏర్పాటు చేశారన్న సంబరమే తప్ప దాననుగుణంగా ఏర్పాట్లు చేయక పోవడంతో పాత సమస్యలే ఎదురవుతున్నాయి. అరకొర వసతుల నడుమనే అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. అలాగే అద్దె కూడా నెలనెలా సక్రమంగా రాకపోవడంతో కొన్ని మండలాల్లో కార్యాలయాలకు తాళం వేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కనీసం కొన్నిచోట్ల మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేకపోవడంతో అధికారులతో పాటు కార్యాలయాలకు వచ్చిపోయే మహిళలు చెప్పుకోలేని ఇబ్బందుల పాలవుతున్నారు. కొన్నిచోట్ల తాత్కాలికంగా రేకుల షెడ్లలోనే ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయడంతో చిన్నపాటి వర్షానికి కార్యాలయాలను మూసి వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కార్యాలయాల రికార్డులకు భద్రత కూడా లేకుండానే పోతుంది. అలాగే గ్రామీణ ప్రజలకు ఎంతో ముఖ్యమైన శాఖలుగా చెప్పుకునే వ్యవసాయ శాఖ, విద్యాశాఖ,పశు సంవర్ధక శాఖలకు అసలే భవనాలే కనిపించడం లేదు. దీంతో అధికారులను కలిసేందుకు ప్రజలు పాత మండలాలతో పాటు జిల్లాకేంద్రానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కొత్త మండలం ఏర్పడితే మరింత అభివృద్ధి జరుగుతుందని ఆశపడ్డ ప్రభుత్వ నిర్లక్ష్యంతో అసలుకే మోసం వచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



● సిరికొండ మండల పరిషత్ కార్యాలయం

ఇన్‌చార్జీలతో ఇబ్బందులు

కొత్త మండలాలను ఏర్పాటు చేసిన దాననుగుణంగా అధికారుల నియామకాన్ని చేపట్టక పోవడంతో ఒక్కో అధికారికి రెండు, మూడు శాఖల బాధ్యతలను అప్పగిస్తున్నారు. మండలం కొత్తదైనా పాత మండల అధికారులే ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నారు. కొత్త మండలాల్లో కనీస సౌకర్యాలు లేవన్న కారణంగా అధికారులెవరూ విధులు నిర్వహించేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో కొత్త మండలాల్లో పని చేసేందుకు అధికారులు ఎవరూ ముందుకు రావడం లేదు. బదిలీపై కొత్త మండలానికి వెళ్లాల్సి వచ్చిన దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లి.. వెంటనే ఇతర మండలాలకు బదిలీ చేయించుకుంటున్నారు. సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో లేకపోవడంతో పాత మండలానికి వెళ్తే.. తమకేమీ తెలియదంటూ అక్కడి అధికారులు సమాధానమిస్తున్నారు. ఇన్‌చార్జి అధికారులు పాత మండలాల నుంచి కదలిక పోవడంతో అక్కడికే వెళ్లి పనులు పూర్తి చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం నలుగురైదుగురు అధికారులు తప్ప, కొత్త మండలాల్లో కొనసాగుతున్న వారంతా ఇన్‌చార్జీ అధికారులేనని తెలుస్తుంది. ప్రజల డిమాండ్ మేరకు కొత్త మండలాన్ని ఏర్పాటు చేసినా.. స్థానికంగా పాలన సక్రమంగా కొనసాగేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంతో కొత్త మండలాల సంబరం లేకుండానే పోయిందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.





కొత్త మండలాల్లో వసతులను కల్పించాలి

: గోర్బండి మారుతి, రైతు, సిరికొండ



పాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసినా.. అవసరమైన వసతులను కల్పించాలి. లేదంటే పాత సమస్యలే ఎదురవుతున్నాయి. కొత్త మండలం ఏర్పడినప్పటికీ.. అధికారుల నియామకం, కార్యాలయ భవన నిర్మాణాలను చేపట్టకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఏదైనా అత్యవసరమైతే అధికారులు దొరకడం లేదు. మళ్లీ పాత మండలానికి వెళ్లి పనులు చేయించుకునే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిని సారిస్తే బాగుంటుంది. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.

సంక్షిప్త సమాచారం



సీఎం సెక్రెటరీని సన్మానిస్తున్న పాయల

సీఎం సెక్రెటరీని కలిసిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 29: ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన ముఖ్యమంత్రి కార్యాలయం కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మర్యాద పూర్వకం సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించారు. జిల్లాలోని పలు సమస్యలను సత్వరమే పరిష్కర మార్గాలను చూపాలని కోరారు.

క్రీడాకారులకు జెర్సీ పంపిణీ

నేరడిగొండ, జనవరి 29: మండల కేంద్రంలో ప్రతి సంవత్సరం ఐపీఎల్ తరహా నిర్వహించే సర్పంచ్‌కప్-2 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం నేరడిగొండ వార్డు సభ్యులు సాబ్లె సంతోష్‌సింగ్ ఇండియన్ బ్లేజర్స్ టీమ్ జెర్సిని క్రీడాకారులకు అందజేశారు. ఇందులో డా.లక్ష్మణ్, మహేందర్, పవన్, లఖన్, దినేష్, శేఖర్, హరీష్, ప్రశాంత్, జీవన్, ప్రీమియర్ లీగ్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కౌటా(బి)లో క్రికెట్ పోటీలు

బోథ్, జనవరి 29: మండలంలోని కౌటా(బి) గ్రామంలో సోమవారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గాజుల సురేందర్, ఉప సర్పంచ్ సిలకడి రవీందర్, వార్డు సభ్యులు ఐ.రమణారెడ్డి వీడీసీ ఉప అధ్యక్షుడు ముడుపు భూమారెడ్డి, గ్రామ నాయకులు కొంకటి గంగాధర్‌లు ప్రారంభించారు. మొదటి రోజున కౌటా(బి), పొచ్చెర గ్రామాలకు చెందిన పలువురు క్రీడాకారులు పోటీలో తలపడ్డారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మోడల్ స్కూల్‌లో ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమం

గుడిహత్నూర్, జనవరి 29: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ నరేందర్, డాక్టర్ సుజాత విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి ఎనిమియా సమస్యలు ఉన్న వారికి ఐరన్ మాత్రలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐరన్ అందించే పోషకాహారం తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శివాజీ, వైద్య సిబ్బంది ఉన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు

● అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ● కేస్లాపూర్‌లో సభాస్థలి ఏర్పాట్ల పరిశీలన ● పాల్గొన్న అధికారులు, సిబ్బంది

ఇంద్రవెల్లి, జనవరి 29: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కేస్లాపూర్‌లో పటిష్ఠ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. సీఎం పర్యటనలో భాగంగా నాగోబా దర్శనం, హెలీప్యాడ్, దర్బార్ హాల్‌లో సభ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గిరిజన, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించి స్టాల్‌లను ఏర్పాటు చేయాలని, పొదుపు సంఘాల మహిళలను గుర్తించాలని సూచించారు. నాగోబా దేవాలయ ప్రాంగణంలో వివిధ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. హెలీపాడ్ వద్ద అగ్ని మాపక వాహనాన్ని, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని, ఇతర అవసరమైన ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ డైరెక్టర్ గోపాల్ రావు, డీఆర్‌డీవో పీడీ కిషన్, రెవెన్యూ, పంచాయితీ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నాగోబా దర్బార్ హాల్‌ను పరిశీలించిన కలెక్టర్



కేస్లాపూర్‌లో హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



కొనసాగుతున్న పనులను అడిగి తెలుసుకుంటూ..

గిరిజన సమస్యల పరిష్కారానికి చర్యలు

● గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో ఖుష్బుగుప్తా

ఉట్నూర్, జనవరి 29: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జీ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. ఇంద్రవెల్లి మండలం టాకిగూడ గ్రామానికి చెందిన నగేష్ తనకు బోరుబావి మంజూరు చేయాలని, నేరడిగొండ మండలం వాగ్ధారి గ్రామానికి చెందిన జె.రామారావు ఉపాధి కల్పించాలని, బేల మండలం సైదపూర్ గ్రామానికి చెందిన జి.థాయ్ తనకు రైతుబంధు ఇప్పించాలని, జైనూర్ మండలం ఉషేగావ్ గ్రామనికి చెందిన అన్నపూర్ణ ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని కోరారు. పింఛన్, రెండు పడక గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబందించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఇందులో ఏపీవో కనక భీంరావు, ఏఓ సున్నంరాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, ఆర్‌సీవో గంగాధర్, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● 'ఏజెన్సీ గ్రామాలకు శాశ్వత సాగు, తాగునీరు అందించాలి'

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్ ఏజెన్సీ గ్రామాలకు శాశ్వతంగా సాగునీరు, తాగునీరు అందించాలని రైల్వేలైన్, యానివరిసటీ, సాగునీరు తాగునీరు సాధన కమిటీ నాయకులు ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను కోరారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారిని కలిసి ఈ మేరకు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా కన్వీనర్ భరత్‌చౌహాన్ మాట్లాడుతూ ఆదిలాబాద్ నుంచి కేస్లాపూర్ ఉట్నూర్, జోడేఘాట్ మీదుగా కాగజ్‌నగర్ వరకు రైల్వేలైన్ మంజూరు చేయాలని, ఉట్నూర్‌లో అగ్రికల్చర్ డెంటల్‌తో పాటు పలు డిమాండ్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియ జేయాలని పీవోను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్ట లక్ష్మణచారి, బానోత్ రామారావు, నేతావత్ రాందాస్, మెస్రం నారాయణ, తదితరులున్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జి పీవో ఖుష్బుగుప్తా



పీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమ కమిటీ నాయకులు



కాలినడకన తిరిగి వస్తున్న మెస్రం వంశీయులు

ఉట్నూర్‌కు చేరుకున్న మెస్రం వంశీయులు

ఉట్నూర్, జనవరి 29: మెస్రం వంశీయుల ఆరాధ్య దైవం నాగోబా మహా పూజ కోసం పవిత్ర గంగాజలం కోసం కాలినడకన బయలుదేరిన వంశీయులు ఆదివారం జన్నారం మండలం కలమడుగు వద్ద ఉన్న గోదావరి హస్తిన మడుగులో పవిత్ర జలాలను ప్రత్యేక కలశంలో సేకరించి తిరుగు ప్రయాణం ప్రారంభించారు. సోమవారం సాయంత్రానికి ఉ ట్నూర్ మండలం కొత్తగూడెంకు చేరుకున్నారు. కొత్తగూడెం వరకు చేరుకోగా ఉట్నూర్ ఎంపీపీ జైవంత్‌రావు మేస్రం గిరిజనులకు స్వాగతం పలికి వారికి చాయి, బిస్కెట్లు అందిస్తూ ఆతిథ్యం ఇచ్చారు. అనంతరం వారు ఉట్నూర్ పట్టణంలోని కొము రంభీం ప్రాంగణం సమీపంలో ఉన్న ఏత్మాసూర్‌నగర్‌కు చేరుకుని రాత్రి బస చేశారు. ఈనెల 22 నుంచి వందలాది మంది మెస్రం వంశీయులు తెల్లని దుస్తులు ధరించి, భుజాన నల్లని బ్యాగులలో తమ దుస్తులు పెట్టుకుని, చేతిలో కనక కర్ర పట్టుకొని పవిత్ర జలాల కోసం కాలినడకన ఇంద్రవెల్లి, నార్నూర్, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల మీదుగా జన్నారం మండలం హస్తినమడుగుకు ఆదివారం చేరుకున్నారు. ప్రత్యేక పూజలు గోదావరి జలాలకు నిర్వహించి ప్రత్యేక కలశంలో సేకరించిన జలాలను కింద నేలకు తగలకుండా పదిలంగా నాగోబా జాతర వరకు తీసుకు వస్తున్నారు. మార్గమధ్యంలో మెస్రం వంశీయుల వద్ద రాత్రి బస చేసినప్పటికీ కట్టెల పైన పెట్టి పవిత్రజలాలను భూమికి తాకకుండా కాపడుతుంటారు. తిరిగి మంగళవారం ఉదయం ఉట్నూర్ ఎత్మాసూర్‌నగర్ నుంచి బయలుదేరి రామలింగంపేట వద్ద ఉన్న మెస్రం కేశవ్ ఆతిథ్యాన్ని స్వీకరించి అక్కడి నుంచి పాదయాత్ర ద్వారా ఏందా, ఉమ్రి, నర్సాపూర్ మీదుగా ఇంద్రవెల్లి మండలం దొడందా చేరుకుంటారు. అక్కడ బస చేసి ఫిబ్రవరి 5న ఇంద్రవెల్లిలోని ఇందిరాయి దేవతకు పూజలు చేసి అదేరోజు రాత్రి పవిత్రజలాలతో కేస్లాపూర్ నాగోబా ఆలయ ప్రాంగణం సమీపంలో ఉన్న మర్రిచెట్టు వద్దకు చేరుకుంటామని మెస్రం వంశీయుల కటోడా తెలిపారు.



కలమడుగు గోదావరి వద్ద నుంచి బయలుదేరిన మెస్రం వంశీయులు

'అదనంగా ఎకరం భూమి కొనుగోలు చేసి స్మృతి వనం ఏర్పాటు చేయాలి'

ఇంద్రవెల్లి, జనవరి 29: రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఎకరం భూమి కొనుగోలు చేసి అమరవీరుల స్మృతి వనం ఏర్పాటు చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపూరావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏటా ఏప్రిల్ 20న ఆదివాసీలు అమరవీరుల స్థూపం వద్ద సభలు, సమావేశాలు నిర్వహించటం జరుగుతుందని, ఆ స్థలంలోనే స్మృతి వనం ఏర్పాటు చేస్తే సభాలు, సమావేశాలు ఏర్పాటు చేయడానికి ఇబ్బంది అవుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమరవీరుల స్థూపం కోసం అదనంగా ఎకరం భూమిని కొనుగోలు చేసి స్మృతి వనం ఏర్పాటు చేయాలని అన్నారు. అదేవిధంగా అమరవీరుల కుటుంబాలను, ఇంద్రవెల్లి ఘటనలో గాయాలైన వారిని గుర్తించి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భారత్, మండల అధ్యక్షుడు జుగ్నాక్ భారత్, మడావి ఇంద్రు, చహకటి నాగోరావు, ఆత్రం నందు, ఆత్రం దుర్కు, మెస్రం భారత్, రాందాస్, గేడం ఉమేష్ తదితరులు ఉన్నారు.